ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మళ్లీ వరద భయం

రాయనపాడు స్టేషన్‌లో ట్రాక్‌పై చేరిన వరద నీరు

- అడుగు మేర పెరిగిన నీరు
- ముంపు ప్రాంతాల్లో ఆగని ఆకలికేకలు
- బాధితులను చుట్టుముడుతున్న వ్యాధులు
- గండి పూడ్చివేతకు రంగంలోకి ఆర్మీ
- ఇంకా నీటిలోనే నానుతున్న పొలాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, విజయవాడ

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లోకి క్రమంగా వరద పెరుగుతోంది. బుడమేరుకు గండి పడిన ప్రాంతం నుంచి వరద పోటెత్తడంతో ఐదు రోజుల పాటు దుర్భర స్థితిలో గడిపిన కొన్ని కాలనీ వాసుల్లో ఆందోళన మొదలైంది. బుడమేరు ముంపు నుంచి ఇప్పుడిప్పుడే బాధితులు తేరుకుంటున్న సమయంలో గురువారం కంటే శుక్రవారం అడుగు మేర వరద పెరగడంతో అవస్థలు పడుతున్నారు. తిరిగి ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. విజయవాడలోని పలు ముంపు ప్రాంతాల్లో ఆకలి కేకలతో బాధితులు రోడ్డెక్కుతున్నారు. 'మా ఆకలి తీర్చండి... న్యాయం చేయండి' అని ఆందోళనలకు దిగుతున్నారు. మరోపక్క ప్రభుత్వం బాధితులకు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీని శుక్రవారం నుంచి ప్రారంభించింది. బుడమేరు వరద బాధితుల కోసం విజయవాడ సింగ్‌నగర్ పైపులరోడ్ జంక్షన్లో సిపిఎం ఆధ్వర్యాన నిరంతర ఆహార పంపిణీ కేంద్రాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ప్రారంభించారు. ఫైర్ ఇంజన్ల సాయంతో ఇళ్లు శుభ్రం చేయడానికి వరద పెరుగుదల ఆటంకంగా మారింది. ఈ క్రమంలో లోపించిన పారిశుధ్యం కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న 450 మందికి విషజ్వరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి పది గంటల సమయంలో విజయవాడ శివారు రాయనపాడులోని వరద తాకిడి పెరగడంతో గ్రామంలోని ఇళ్లు నీటమునిగాయి. రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌ల పైకి వరద నీరు చేరింది. మరోపక్క బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుడమేరు, కృష్ణా వరదల కారణంగా లక్షలాది ఎకరాల్లోని పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. బుడమేరు ముంపు ప్రాంతాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నేతలు పరిశీలించారు.

... వార్తలు మెయిన్, టబ్లాయిడ్‌లో

తోట్లవల్లూరులో నీటమునిగిన పసుపు పంటను చూపుతున్న రైతు

సింగ్‌నగర్‌ను వీడని బుడమేరు వరద

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధితులు

సాయం కోసం బాధితుల నిరసన

- అజిత్‌సింగ్‌నగర్లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన
- మద్దతు తెలిపిన సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద బాధితులు శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సమీపంలో ఆందోళనకు దిగారు. అంపాపురం గ్రామ పరిధిలోని 10 వీధుల ప్రజలకు ఎటువంటి సహాయం అందలేదని, బుడమేరు వరద శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ బాధితులు ఆందోళన చేపట్టారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నా బుడమేరు నుండి రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు రోజుల నుండి నరకం చూస్తున్నామని ఆందోళనకారులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమను పరామర్శించలేదని, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని (మిగతా 2లో)

ఎంఎల్ఎ కొలికపూడి ఆదేశంతో

స్టేషన్లో డ్వాక్రా మహిళల నిర్బంధం

ప్రజాశక్తి-తిరువూరు: తమ సమస్య విన్నవిద్దామని వస్తే ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావు అసభ్య పదజాలంతో తమను తిట్టి పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారని డ్వాక్రా మహిళలు అవేదన వ్యక్తం చేశారు. విస్సన్నపేట మండలం, పుట్రెల దక్షిణ మాలపల్లికి చెందిన ఇందిరా క్రాంతి పథం ప్రతిభ విఒకు సంబంధించిన డ్వాక్రా గ్రూపు లీడర్లు శుక్రవారం ఎంఎల్ఎను తిరువూరులో కలిశారు. తమ విఒకు చెందిన బుక్ కీపర్‌ను మార్చవద్దని విన్నవించుకున్నారు. దీంతో ఎంఎల్ఎ డ్వాక్రా మహిళలను అసభ్య పదజాలంతో దూషించి తాను చెప్పే వరకు విడిచిపెట్టొద్దని స్టేషన్‌లో పెట్టాలని పోలీసులకు చెప్పినట్లు బాధిత మహిళలు తెలిపారు. దీంతో పోలీసులు తమను స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. విషయం తెలుసుకున్న తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైసిపి కౌన్సిలర్ (మిగతా 2లో)

వరద పెరిగింది... మళ్లీ వాహనాలను ముంచింది

ప్రజాశక్తి-విజయవాడ : 'వరద రాగానే బంధువుల ఇళ్లకు వెల్లిపోయా. కాస్త తగ్గిందని సింగ్‌నగర్లో ఉన్న తన ఇంటికి వెళ్లా, నీళు లేని చోట తన బైక్ పార్కింగ్ చేశా. శుక్రవారం ఉదయం వరద పెరగడంతో వాహనం మళ్లీ నీట మునిగింది. బైక్ స్టార్ట్ కావడం లేదు' అని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఎ.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. వరద పెరగడంతో పైప్‌లరోడ్డు, రాజరాజ్వేరిపేట, జక్కంపూడి కాలనీల్లోని పలు ద్విచక్రవాహనాలు, ఆటోల్లోకి నీరు చేరింది. వాహనాలు స్టార్ట్ కాకపోవడంతో ఇతరుల సాయంలో నీటితోనూ తోసుకుంటూ బయటకు తీసుకొచ్చుకున్నారు. రిపేర్లకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

జావా నుండి '42 ఎఫ్‌జె' బైక్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నియో క్లాసిక్ విభాగానికి సంబంధించిన జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ నుండి జావా 42 లైఫ్ బైక్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ సహ వ్యవస్థాపకులు అనుపమ్ తరేజా తెలిపారు. నగరంలోని జావా డీలర్‌షిప్‌లో మోటార్ బైక్‌ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది ఉన్నతమైన డిజైన్‌తో కూడిన అసమానమైన రైడింగ్ అనుభవం అందిస్తుందన్నారు. 2024 జావా 42 మోటార్ సైకిల్ ఇంజనీరింగ్‌కి తమ డిజైన్ అధునీకరణకు అద్దం పడుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు జావా బైక్‌ల పట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

బాధితులను చుట్టుముడుతున్న వ్యాధులు

ప్రజాశక్తి-విజయవాడ: వ్యాధులు చుట్టుముట్టాయి. వరదల్లో చిక్కుకొని రోజుల తరబడి మురుగు, దుర్వాసన వస్తున్న మురుగునీటి మధ్యలో ఉండటం, కలుషిత వాటర్‌ను తాగుతున్నందున ప్రజలను విషజ్వరాలు ప్రజలకు సోకుతున్నాయి. అధికారులు తీసుకుంటున్న చర్యలు పూర్తి స్థాయిలో ఉండటం లేదు. అంతా మొక్కుబడిగా ఉంటున్నాయని రోగులు పడుతున్న ఇబ్బందులను బట్టి తెలుస్తుంది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, కిడ్నీ వ్యాధి గ్రస్తులు, గుండె సంబంధిత, పక్షవాతం, వరదల ముందు నుంచే విషజ్వరాలతో అల్లాడుతున్న వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

పునరావాస కేంద్రాల్లో 450 మందికి విషజ్వరాలు

పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారిలో 450 మందికి విషజ్వరాలు సోకినట్లు, అలాగే వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిలో 620 మందికి విషజ్వరాలు సోకినట్లు శుక్రవారం గుర్తించినట్లు జిల్లా వైద్యశాఖాధికారుల నుంచి అందుతున్న సమాచారం. జిల్లాలో 105 పునరావాస కేంద్రాలుండగా, విజయవాడ నగరంలోనే 93 పునరావాస కేంద్రాల్లో వరద బాధితులు తలదాచుకుంటున్నారు. శానిటేషన్, మంచినీరు, పరిసరాలు కూడా అపరిశుభ్రత వాతావరణంతో పాటు ఆహార పదార్థాలు సరిగా లేక అత్యధిక మంది విషజ్వరాల బారిన పడుతున్నట్లు తెలుస్తుంది. సింగ్‌నగర్ 59వ డివిజన్ పూలకొట్టు సెంటర్‌లో నివాసముంటున్న ఎం. మల్లేశ్వరి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, వరద నీటిలోనే ఉండటంతో అత్యవసర చికిత్సకోసం ఆమెను రిస్క్యూ టీమ్ ఎన్‌డిఆర్‌ఎఫ్ బోటులో డాబాకొట్లు సెంటర్ వరకు అతి బలవంతంగా తీసుకొచ్చి,

అంబులెన్స్‌లో ఒక ప్రయివేటు వైద్యశాలకు తరలించాల్సి వచ్చింది. ఇదే రీతిలో మోకాళ్ల లోతు వరద నీటి మధ్యలోనే అనేక మంది తీవ్రమైన వ్యాధులతో, విషజ్వరాలతో బాధపడుతున్నా... అటువంటి వారిని గుర్తించడం, సరైన వైద్యం అందించడం, భోజనం, మంచినీటి సదుపాయం కల్పించాల్సిన ప్రభుత్వం, అధికారులు ఆదిశగా చర్యలు సూన్యగా ఉన్నాయని వరద బాదితులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. వ్యాధులు ముదిరిపోయి, మృత్యువాత పడాల్సి వస్తుందనే భయాందోళనలో అనేక మంది ఉన్నారు. ఇప్పటికయినా రిస్క్యూటీమ్‌తో జిల్లా వైద్యాధికారులు చిత్తశుద్ధితో విషజ్వరాలు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని వరద బాధితులు కోరుతున్నారు. వరద తాకిడికి ఇప్పటికే పదులు సంఖ్యలో మృత్యువాతపడినట్లు అధికారుల గణాంకాలే విధితం చేస్తున్నాయి.

వసతి, భోజనం కోసం కార్మికుల అవస్థలు

ప్రజాశక్తి-విజయవాడ: పారిశుధ్య కార్మికుల అవస్థలు వర్ణనాతీతంగా తయారయ్యాయి. రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన పారిశుధ్య కార్మికులకు వసతి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు కూడా వరద బాధితుల మాదిరి దాతలు ఇస్తున్న భోజన ప్యాకెట్లు కోసం ఎగబడి తీసుకోవాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావిత సింగ్‌నగర్‌తో పాటు నగరంలోని ఆయా ప్రాంతాలను క్లీన్ చేసేందుకు రాష్ట్రంలో ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి వెయ్యి మంది కార్మికులను రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఇక్కడకు తరలించారు. అయితే ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులతో అత్యంత భయానకమైన, ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నప్పటికీ...వారికి కనీసమైన సదుపాయాలు కల్పించడంలో సంబంధి శాఖాధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కనీసంగా "టీ" ఖర్చులకు అధికారులు రూపాయి కూడా ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. అన్ని రకాల ఖర్చులు భరించుకొని, వసతి కూడా బాగుంటుందని తమ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య విభాగం అధికారులు చెప్పి...పంపించారని, కానీ ఇక్కడకు వచ్చిన తరువాత ఎవరో దాతలు పెడుతున్న అన్నం ప్యాకెట్ల కోసం ఎగబడి తీసుకోవాల్సి వస్తుందని, కనీస సదుపాయం కూడా లేదని మచిలీపట్నం కార్పొరేషన్ నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు సుమంత్, ఆర్ రామయ్య, యర్రంశెట్టి చంటి, ఇతర పలువురు కార్మికులు ప్రజాశక్తికి చెప్పి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మచిలీపట్నం కార్పొరేషన్ నుంచి 100 మంది అప్కాస్ కార్మికులను తీసుకొచ్చి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఉర్దూస్కూల్‌లో షెల్టర్ ఇచ్చారు. కానీ అక్కడ ఎటువంటి ఏర్పాట్లు కూడా లేవని, దోమలు, ఈగలుతో అవస్థలు పడుతున్నామని, రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో చలిలో వణికి పోతున్నా..ఏ ఒక్కరూ కూడా పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోయారు. విషజ్వరాల బారిన పడి నలుగురు కార్మికులు తిరిగి వెళ్లిపోయారని కార్మికులు వ్యక్తం చేశారు.ఎవరో పెట్టిన అన్నం తింటూ...అత్యంత దుర్వాసన, ఇబ్బందికరమైన పని చేయక తప్పడం లేదంటున్నారు. గత నెల (ఆగస్టు) వేతనం కూడా ఇవ్వలేదని, తాము ఇక్కడకు

వచ్చేసమయములో ఇళ్లల్లో ఖర్చులకు ఏమి ఇచ్చి రాకుండానే వచ్చామని వారు వాపోయారు. ప్రస్తుతం ఎవరో పెడుతున్న అన్నంతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోందని, కనీసంగా టిఫన్ చేయడానికి, టీ తాగడానికి కూడా ఒక్క పైసా డబ్బులు లేవని కార్మికులు వ్యక్తం చేశారు. ఇక్కడ పని కూడా చాలా దుర్భరంగా ఉందని అన్నారు. చనిపోయి ఉబ్బిపోయిన పశువుల కళేబరాలు, అలాగే పందులు, కుక్కలు, పిల్లులు, ఎలుకలు చనిపోయిన వాటిని, చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు, ఇళ్లల్లో నుంచి వస్తున్న పరుపులు, ఇతర వస్తువులు మొత్తాన్ని ట్రాక్టర్, లారీల్లోకి ఎత్తేసి సింగ్‌నగర్ డంపింగ్ యార్డులోని ట్రాన్స్‌ఫర్‌స్టేన్‌కు తరలించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. దుర్వాసన, ప్రమాదకరంగా ఉన్నప్పటికీ పని చేయక తప్పడం లేదని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి విశ్రాంతి లేకుండా చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా తమకు కనీసంగా భోజనం, మంచినీరు, సరైన వసతి కల్పించాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

సాయం కోసం బాధితుల నిరసన

ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీరు, ఆహారం అందటం లేదని, బయటకు రావడానికి పడవలు, రవాణా సదుపాయం ఏర్పాటు చేయలేదని, ఇంకా ఎన్ని రోజులు ఇలా ఉండాలని ప్రశ్నించారు. అధికారులు వచ్చేవరకు కదలబోమని ఇన్నర్ రింగ్ రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు వారికి సంఘీభావం తెలిపి ఆందోళనలో పాలుపంచుకున్నారు. బాధితుల ఆవేదనను తెలుసుకున్నారు.

స్టేషన్లో డ్వాక్రా మహిళల నిర్బంధం

పర్సా శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు జి.నాగేశ్వరరావు, ఏరువ ప్రకాశ్ రెడ్డి, మోషే తదితరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎంఎల్‌ఎ తీరును ఎండ గట్టారు. డ్వాక్రా మహిళల సమస్యపై ఎంఎల్‌ఎ ఇలా ప్రవర్తించి స్టేషన్‌లో నిర్బంధించడం దుర్మార్గమని మండి పడ్డారు. మధ్యాహ్నం అనంతరం పోలీసులు వారిని విడుదల చేశారు.

ఎంఎల్‌ఎపై మహిళల ఫిర్యాదు

ఎంఎల్‌ఎ శ్రీనివాసరావు తమను అసభ్య పదజాలాలతో దూషించి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని పుట్రెల దక్షిణ మాలపల్లికి చెందిన ఇందిరా క్రాంతి పథం ప్రతిభ ఇఒకు సంబంధించిన 19 మంది గ్రూప్ లీడర్లు ఎస్‌ఐ సత్య నారాయణకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకొని తమ మనోభావాలను పరిరక్షించాలని మహిళలు పేర్కొన్నారు.

విద్యుతాఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి

ప్రజాశక్తి - భవానీపురం

విద్యుతాఘాతంతో భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సితార సెంటర్ కబేళా రోడ్డులో నివాసం ఉంటున్న ఓ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు పాతాళం రాము (50) మృతిచెందాడు. ఈనెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరాడు. అయితే గురువారం ఇంట్లో విద్యుతాఘాతంతో మరణించి ఉన్నాడు. చుట్టుపక్కన వారు గమనించి ఆయన భార్య లక్ష్మికి సమాచారం ఇచ్చారు. భవానీపురం ఎఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సిఎం పర్యటన

ప్రజాశక్తి - యంత్రాంగం : విజయవాడ పరిసరాల్లోని వరద ముంపు ప్రాంతాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఏరియల్ సర్వే చేపట్టారు. బుడమేరు పరీవాహక ప్రాంతాలను, కొల్లేరు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బుడమేరు ప్రవాహం, ముంపు, గండ్లు పడిన ప్రాంతాలను చూశారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కష్ణా నది ప్రవాహాన్ని పరిశీలించారు.

నిత్యావసర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు శుక్రవారం నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపి కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు 50 వేల కుటుంబాలకు కిట్లు పంపిణీ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కిట్లో 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, 2 కిలోల ఉల్లి, 2 కిలోల బంగాళదుంపలు, లీటర్ నూనె ఉంటాయి. ఈపోస్ మిషన్ ద్వారా మొత్తం 2 లక్షల కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్‌జడ్జి అవనిగడ్డ వారి కోర్టులో

ఎఫ్.డి.పి. నెం.1/2020 ఇన్ ఓ.యస్.నెం. 16/2023

బిట్వీన్:
తోట శివశంకర్ .... పిటీషనర్ / వాది
మరియు
కొక్కిలిగడ్డ పరమేశ్వరరావు ... రెస్పాండెంట్ / ప్రతివాది

టు : రెస్పాండెంట్ / ప్రతివాది :
కొక్కిలిగడ్డ పరమేశ్వరరావు, తండ్రి : నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 41 సం॥లు, నివాసం : డోర్ నెం. 6-22, నదిరోడ్డు, నాగాయలంక గ్రామం, నాగాయలంక మండలం.

పై నెంబరు పిటీషన్‌ను ఫైనల్ డిక్రీ కోరుతూ పిటీషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టువారు నీకు నోటీసులు అమలు నిమిత్తం ది. 27-9-2024వ తేదీకి ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఫైనల్ డిక్రీ పిటీషన్ ది. 27-9-2024వ తేదీన పై కోర్టువారి ఎదురు మీరు మీ న్యాయవాది ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపగలరు. లేనియెడల వాజ్యము మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియపర్చటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 27-9-2024

ఇట్లు
శ్రీ బొప్పన సుబ్రహ్మణ్యేశ్వరరావు,
అడ్వకేటు, అవనిగడ్డ.
సెల్ నెం: 9949332270

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT AND SESSIONS JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P. 559/2022

Between:
Shaik Valli & 2 others ...Petitioners
And:
Sri M. Srinivas & 2 others ...Respondents

NOTICE

To,
R-1: Sri M. SRINIVAS,
S/o. Ramulu, Hindu,
aged not known but Major,
R/at D.No.2-141, Yadagaru Pally,
Miryalaguda, Nalgonda,
Telangana State-508207.
(Driver of the Lorry Reg. No. AP 16 TH 8248)
R-2: NCL INDUSTRIES LIMITED,
Rep. by Executive Director
K. Gautam, situated at
Kadimipothavaram, Pinapaka,
G. Konduru, Krishna District-521 229.
(Owner of the Lorry Reg. No. AP 16 TH 8248)

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against both of you for claiming compensation and the matter stands posted to **19-09-2024** for your appearance on that day at **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
Y. NARASINGA RAO YADAV
& P. LAKSHMANA RAO
Advocates, Gajuwaka,
Visakhapatnam, Cell: 9014445077

CHANGE OF NAME

I, Radhadevi Chowdary (old name) W/o.Suresh Kumar Chowdary is known as **Shardha Devi, W/o.Suresh Kumar Chowdary** Resident of D.No.27-23-19A, Gopal Reddy Road, Governerpet, Vijayawada, NTR District, Andhra Pradesh-520002. My Name has been changed to **Shardha Devi, W/o.Suresh Kumar Chowdary (New name)** .Hereafter my name is known as **Shardha Devi, W/o.Suresh Kumar Chowdary.**

పత్రికా ప్రకటన

సాధ్వీ కన్స్ట్రక్షన్ మరియు ఇంజనీరింగ్ వారి సంజాయిషీ ప్రకారము తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ అయిన సాధ్వీ కన్స్ట్రక్షన్ మరియు ఇంజనీరింగ్, ఆఫీసు డోర్ నెం. 6-165, సన్ షైన్ క్యాజిల్ అపార్ట్మెంట్, రామవరప్పాడు డొంక రోడ్డు, H.P. గ్యాస్ కంపెనీ ఎదురుగా, రామవరప్పాడు, విజయవాడ రూరల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన శ్రీ వెజ్జు సోంబాబు 28-08-2024 వ తేదీ మధ్యాహ్నం సుమారు 3.30 ని. లకు P.B. Siddhartha Arts and Science College వద్ద దిగువ తెలిపిన డాక్యుమెంట్ల యొక్క ఒరిజినల్ దస్తావేజులకు ఫోటోస్టాట్ తీయించుటకు సమీప ఫోటోస్టాట్ షాప్ వద్దకు వెళ్ళి జిరాక్సు లు తీయించుకుని తొందరలో వెళ్లిపోయినారు. సదరు మా క్లయింట్ ఆఫీసు కు వెళ్ళిన తరువాత చూసుకొనగా సదరు ఒరిజనల్ దస్తావేజుల సంచి ఫోటోస్టాట్ షాప్ వద్ద మిస్ అయినట్లుగా గ్రహించినారు. సదరు మా క్లయింట్ మరలా సదరు ఫోటోస్టాట్ షాప్ వద్ద విచారించగా ఒరిజనల్ దస్తావేజుల సంచి గురించి ఎటువంటి సమాచారము తెలియరాలేదు. సదరు సంచి నందు జాయింట్ సబ్ రిజిస్ట్రార్, నున్న వారి వద్ద రిజిస్టర్ కాబడిన డా.నెం.299/2023, డా. నెం. 298 /2023, డా. నెం. 297 /2023, డా. నెం. 2312/2023, డా. నెం. 2313/2023 ఒరిజనల్ దస్తావేజులు కలవు. కావున సదరు ఒరిజనల్ దస్తావేజులు గల సంచి ఎవరికి అయినా దొరికిన యెడల మా క్లయింట్ కు పైన తెలిపిన చిరునామా కు పంపినా, అప్పగించినా తగిన పారితోషకం ఇవ్వబడును. అట్లు కాకుండా పైన తెలిపిన దస్తావేజులను ఎవరైనా అన్యాక్రాంతము లేదా క్రయ విక్రయ ప్రయత్నము లేదా ఏదైనా చట్ట వ్యతిరేక చర్యలు జరిపిన యెడల అట్టి వాటికి మా క్లయింట్ బాధ్యులు కారు మరియు అట్టి వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఈ ప్రకటన ద్వారా తెలుపటమైనది.

ఇట్లు
గరిమెళ్ళ దైవ ప్రసాద్
అడ్వకేట్, Ex. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్
సిహెచ్.ఉమా మహేశ్వర రెడ్డి,
జి.లావణ్య
న్యాయవాదులు
527, అమరావతి ఐకన్, తాడేపల్లి, బైపాస్, గుంటూరు- 522501.

ఇంకా జల దిగ్బంధంలోనే..

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శనివారం
7 సెప్టెంబర్ 2024

కంకిపాడు మండలంలో పంటలు పరిశీలిస్తున్న నాయకులు

అవనిగడ్డ మండలంలో సరుకులు అందిస్తున్న బుద్ధప్రసాద్

భవానీపురంలో పర్యటిస్తున్న బోయి సత్యబాబు

చల్లపల్లిలో వాటర్ బాటిళ్లు అందిస్తున్న నాయకులు

గుడ్లవల్లేరు మండలంలో నీట మునిగిన పంట

బుడమేరు కాల్వకు పడిన గండి



నీట మునిగిన పంట పొలాలు (ఏరియల్ వ్యూ)

విజయవాడలో నిత్యావసర సరుకుల పంపిణీ పరిశీలిస్తున్న చంద్రబాబు

విజయవాడలో బాధితుల కోసం సిద్ధం చేస్తున్న సరుకులు

విజయవాడ సింగ్‌నగర్‌లో తగ్గని వరద

విజయవాడ సింగ్‌నగర్‌లో తగ్గని వరద

విజయవాడలో వరద బాధితులకు సాయం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మైలవరం మండలంలో పంటలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నందిగామ మండలంలో వరదనీటిలో వెళ్తున్న బాధితులు

విజయవాడలో సరుకుల వాహనాల బారులు

కంచికచర్లలో రోడ్లపై వరద నీరు

విజయవాడలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

విద్యాధరపురం బస్ డిపోలో వరద నీరు

భవానీపురంలో తగ్గని వరద

విజయవాడలో సరుకులు అందిస్తున్న దృశ్యం

కంచికచర్లలో కోసుకుపోయిన రోడ్డు

మైలవరంలో వరద బాధితులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

విజయవాడలో బాధితులకు ఆహారం అందిస్తున్న దృశ్యం

తోట్లవల్లూరు మండలంలో పాడైన పూలతోట

ఉంగుటూరు మండలంలో వరద నీటిలోనే నడుస్తున్న మహిళలు

ఎ.కొండూరు మండలంలో వరద ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

వీరవల్లిలో ప్రవహిస్తున్న వరద నీరు

వరద ప్రాంతాల్లో సిపిఎం, వివిధ సంఘాల నేతలు పర్యటన

గన్నవరం మండలంలో పర్యటిస్తున్న ఎం.హరిబాబు

అవనిగడ్డ మండలంలో పంటలు పరిశీలిస్తున్న వై.నరసింహారావు

ప్రజాశక్తి-గన్నవరం : రైతుల పాలిట దుఃఖ దాయనిగా మారిన బుడమేరులో ఆక్రమణలు తొలగించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం బాపులపాడు మండలంలో బుడమేరు వల్ల ముంపు గురైన ఆరుగులను,కానుమోలు, పుట్టగుంట గ్రామాల్లో కౌలు రైతు సంఘం నాయకులు పర్యటించారు. బాధిత రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బుడమేరు వల్ల వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని, ఊళ్లో ఇళ్లు ముంపుకు గురయ్యాయని తెలిపారు. రైతులు, సామాన్య ప్రజలు ఆర్థికంగా నష్టపోయి సాయం చేసే వారి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ వరద ముంపుకు ప్రధాన కారణం బుడమేరు ఆక్రమణలే అని చెప్పారు. వాటిని తొలగించేందుకు గత పాలకులు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైన తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. బాధితులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బేతా శ్రీనివాసరావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం శుక్రవారం గన్నవరంలో రెడ్ వాలంటీర్లు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. శ్రీనగర్ కాలనీ, బుద్ధవరం రోడ్డు, జగదీశ్వరరావు కోటర్స్ ఏరియాలో తిరిగారు. రూ. 5,675 నగదు, బట్టలు వచ్చాయని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అనుమోలు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఆంజనేయులు, రాంబాబు, నాగేశ్వరావు, సాంబశివరావు పాల్గొన్నారు. అలాగే సిఐటియు బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ సెంటర్లో జోలి పట్టి ముఠా బిల్డింగ్ కార్మికులు నాయకులు, విరాళాలు సేకరించారు. నల్లి ఆంజనేయులు సారథ్యం వహించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వడ్లమన్నాడులో ముంపునకు గురైన వంట పొలాలను సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘంల నాయకులు శుక్రవారం పరిశీలించారు. సిపిఎం మండల భాద్యులు బి.వి శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం గ్రామ కార్యదర్శి మాదాసు మురళి కష్ణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కటికల యాకోబు.రైతు సంఘం నాయకులు తోట మల్లి పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి నిరాశలై కొత్త మాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు చల్లపల్లి మండల సిపిఎం, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ శుక్రవారం పంపిణీ చేశారు. నాగేశ్వరరావు, సిపిఎం మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, వేముల నాగేశ్వరరావు పాల్గొన్నారు . పట్టుపురుగుల పెంపకం రైతులను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణానది వరద ఉధతికి ముంపుకుగురైన నదిపరివాహక గ్రామాలలో శుక్రవారం సిపిఎం బృందం పర్యటించింది. వరద వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులను పరామర్శించి పంట నష్టం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని వెలువోలు, నిమ్మగడ్డ, నడకుదురు, రాముడు పాలెం గ్రామాలలో పర్యటించారు.కౌలు రైతుల జిల్లా కార్యదర్శిజి. నాగేశ్వరరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** వర్షాల వల్ల ముంపుకు గురైన ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ కోడూరు మండలాల్లోని పంట పొలాలను సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ప్రెస్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడైన వరికి రు 25000 ఉద్యానవన పంటలకు రూ.50 వేల నుండి 70 80 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గౌడశెట్టి నాగేశ్వరరావు, చల్లపల్లి మోపిదేవి సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, బండి ఆదిశేషు, చల్లపల్లి మోపిదేవి కోడూరు మండల పార్టీ కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బెజవాడ నాగేశ్వరరావు, కోపనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బుడమేరులో ఆక్రమణలను తొలగించి, ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. బుడమేరు వరదలవలన నష్టపోయిన ఉప్పులూరు, మంతెన, తెన్నేరు గ్రామాలలో సిపిఎం బందం పర్యటించింది. పార్టీ మండల కార్యదర్శి టి నరేష్, మండల కమిటీ సభ్యులు మంచాల చంటి, కలపాల మురళి పాల్గొన్నారు.

8 వరకు కంట్రోల్ రూమ్ కొనసాగింపు : కలెక్టర్

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అధిక వర్షాలు, వరదల కారణంగా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఈనెల 8వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో సంభవించిన అధిక వర్షాలు కష్ణానది వరద ఉధృతి కారణంగా ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, బాధితులకు సహాయ శిబిరాల ఏర్పాటు చేయడంతో సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సహాయ కార్యక్రమాలు పర్యవేక్షణకై కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08672-252572 ఈనెల 8వ తేదీ వరకు కొనసాగించాలని, కంట్రోల్ రూమ్‌లో 24/7 సిబ్బందికి విధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వరద ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - గుడివాడ : నందివాడ మండలంలో వరద ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలైన చిన్నలింగాల, పెద్దలింగాల, పుట్టగుంట, చేదుర్తిపాడు ఒద్దులమెరక, రామాపురం, కుదరవల్లి, ఇలపర్రు, తదితర లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారిణి పద్మావతి, నందివాడ మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న వెనిగండ్ల రాము

రైతులకు అండగా నిలుస్తాం : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్రమంత్రి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కృష్ణా జిల్లా గన్నవరం మండలం లోని కేసరపల్లిలో బుడమేరు వరద నీటిలో నడుము లోతు వరకు మునిగిన వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. బాధిత రైతులతో ముఖాముఖి మాట్లా డారు. వారి ఆవేదనను ఎంతో ఓపిగ్గా మంత్రి ఆలకించి వారిని అక్కున చేర్చుకుని ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం వారిని అన్ని విధాల ఆదుకుంటుందని ఓదార్చారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-గన్నవరం : ఆంధ్రప్రదేశ్లో నెలకొన్న వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ జాతీయ నాయకులు సంతోష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో వరద కు మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన వరదల కారణంగా కృష్ణాజిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. మునిగిపోయిన పొలాలను, ఇళ్లను చూస్తుంటే హదయ విదారకంగా ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ, ఆ పార్టీ నాయకులు వనజ, జోషి, ఇతరులు పాల్గొన్నారు.

బాధితులకు ఐవిఎం సహాయం

ప్రజాశక్తి-మోపిదేవి : వరద బాధితులకు ఐవీఎం సురేష్ సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మోపిదేవి మండలం బొబ్బర్లంకలో పూర్తిగా వరద నీట మునిగి బయటపడిన అవనిగడ్డ మండలం పులిగడ్డ శివారు రేగుల్లంక, పరిసర ప్రాంతాలకు చెందిన 200ల మంది వరద బాధితులకు చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఐవీఎం ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆర్థిక సహాయం రూ.ఆరు లక్షలతో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఐవీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్ సతీమణి, ఐవీఎం ట్రస్ట్ డైరెక్టర్ వేములపల్లి రోజా పాల్గొన్నారు.

కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలో ఎలుకపాడు, ఆముదాలపల్లి,కొయ్యగూరపాడు, పెద్ద ఆవుటపల్లి, ఆత్కూరు, వేంపాడు గ్రామాలలో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు మద్య రోడ్డు పై నీటి ప్రవాహం ఉదృతంగా కొనసాగుతోంది, వెల్దిపాడు గ్రామం లోపలికి ట్రాక్టర్లు పై ప్రయాణిస్తున్న పరిస్థితి నెలకొంది. లంకపల్లి చెరు వులో వ్యర్థాలను తొలగించారు. ఎంపిడిఓ శేషగిరిరావు, తహశీల్దార్ విమలా కుమారి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

'కొమ్మారెడ్డి'లో చవితి వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని కొమ్మారెడ్డి పాఠశాలలో వినాయక చవితి వేడుకలు ఫ్రీ ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకకు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, ఫలహారాలు తీసుకుని వచ్చి వినాయకుని పూజించారు. పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిటర్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా మట్టి వినాయమని పూజించాలన్నారు.కరస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ . స్కూల్ హెచ్ఎం ఎన్. శ్రీనివాసరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రుణాల కాలపరిమితి రీ షెడ్యూల్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : జిల్లాలో వరద బాధిత ప్రాంత ప్రజల రుణాల కాలపరిమితి రీ షెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో వరద పరిస్థితి సమీక్షించేందుకు శుక్రవారం కలెక్టరేట్ మీకోసం హాలులో బ్యాంకర్లతో జిల్లా సమన్వయ సంప్రదింపుల కమిటీ (డి సి సి/డి ఎల్ ఆర్ సి) ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరద బాధిత ప్రాంత ప్రజల రుణాల కాలపరిమితి రీ షెడ్యూల్ చేయాలని, యుద్ధ ప్రాతిపదికన రుణాలు మంజూరు చేయాలని, ప్రజలకు భరోసా ఇవ్వడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలన్నారు.లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జయవర్ధన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావు, వ్యవసాయ శాఖ డిడి మనోహరరావు, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఎ. నాగమల్లేశ్వరరావు అన్నారు. ఉంగుటూరు మండలం బుడమేరు వరద ముంపులో చిక్కుకున్న ప్రజలకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఆహారాన్ని గన్నవరం ఎస్ఎల్వి ఇన్ఫ్రా కార్యాలయం వద్ద శుక్రవారం 1200 వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లు తయారు చేయించారు. వాటిని మక్కపాడు, వెల్దిపాడు, ఎలుకపాడు, ఆముదాలపల్లి గ్రామాలకు తరలించారు. వెయ్యి లీటర్ల మినరల్ వాటర్ బాటిళ్లను కోయ్యగూరపాడుకు పంపించారు. అసోసియేషన్ సభ్యులు తుమ్మల వెంకటేశ్వరరావు(చిన్న) ఎంఎస్ఆర్ కష్ణా(తణుకు), ఎన్.కోటేశ్వరరావు, తుమ్మల జగదీష్, బి.రాఘవరావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్ పాల్గొన్నారు.

బ్యారేజి వద్ద స్థిరంగా వరద

- ఇన్‌ఫ్లో 1,30,397 క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి 10 గంటలకు బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో 1,30,397 క్యూసెక్కులుగా ఉంది. దీనిలో 1,30,195 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లలో 60 గేట్లను మూడు అడుగులు, ఐదు గేట్లను నాలుగడులు ఎత్తి దిగువకు వదులుతున్నారు. ఐదు గేట్లను పూర్తిగా మూసివేశారు. కాల్వలకు 202 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 11.1 అడుగల మేర నీటి మట్టం ఉంది.

మృతుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడ రూరల్‌లోని గన్నవరం నియోజకవర్గం అంబాపురం, పాముల కాల్వ,పాత పాడులో వరద కారణంగా మృతి చెందిన ఐదుగురు వ్యక్తులు కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ.5లక్షల చోప్పున చెక్కులను మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు, అంబాపురం సర్పంచ్ సీతయ్య పాల్గొన్నారు.

నష్టం అంచనాలు రూపొందించాలి

ప్రజాశక్తి-ఘంటసాల : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రభావితమైన పంటల నష్టం అంచనా వివరాలు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను 10వ తేదీ నాటికి పూర్తి చేసి, ఆయా రైతు సేవా కేంద్రం నోటీసు బోరులలో 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ముసాయిదా జాబితాలను ప్రదర్శిస్తామన్నారు.

ఉచితంగా వరద బాధితుల గ్యాస్ స్టవ్ల మరమ్మతులు

ప్రజాశక్తి - భవానీపురం : వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లలో వరద నీరు చేరి పాడైపోయిన వంటగ్యాస్ స్టవ్‌లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా మరమ్మతులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కుమ్మరిపాలెం వద్ద ఉన్న షాదీఖానాలో ఉచిత గ్యాస్‌స్టవ్‌ల మరమ్మతు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యాధరపురంలోని శ్రీ భవాని గ్యాస్ కంపెనీ అధినేత గద్దె హరిబాబు ఆధ్వర్యంలో శ్రీ భవాని గ్యాస్ సిబ్బంది, మెకానిక్‌లు పాల్గొని వరద బాధిత ప్రజల గ్యాస్ స్టవ్‌లకు ఉచితంగా మరమ్మతులు చేసి ఇచ్చారు. వరదల్లో ఇళ్ళు మునిగిపోయి గ్యాస్ స్టవ్‌లు పాడైపోయినవారు ఈ శిబిరానికి వచ్చి తమ గ్యాస్ స్టవ్‌లను బాగు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భవాని గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ, వి.లక్ష్మణరావు, మెకానిక్‌లు రవీంద్ర, సాయి, ఆసిఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నాలుగు రోజులుగా ఎపిలో కురుస్తున్న వర్షాలు, వరదలతో ఇండ్లలోకి నీరు చేరి చాలా ప్రాంతాల్లో స్టవ్‌లు పని చెయ్యడం లేదు. దీనిపై స్పందించిన అన్నపూర్ణ గ్యాస్ ఏజెన్సీ హెచ్‌పి.గ్యాస్ జగ్గయ్యపేట ఏజెన్సీ నిర్వాహకులు ఏపీలో వివిధ ప్రాంతాలలో విజయవాడ, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో శుక్రవారం ఉచిత గ్యాస్ స్టవ్ మొబైల్ రిపేర్ సెంటర్ ప్రారంభించారు. జగ్గయ్యపేట హెచ్‌పి గ్యాస్ డీలర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పన రామ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : బుడమేరు వరద ప్రభావిత ప్రాంత వాసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో భవానీపురం పాత పోలీస్‌స్టేషన్ సమీపంలోని వెలంపల్లి కాలనీ, హెచ్‌బి.కాలనీ ప్రాంతాల్లో రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తున్న వ్యాన్‌ల్లో నిత్యావసర సరుకులను తీసుకువచ్చి వరద తగ్గుముఖం పట్టిన భవానీపురం హెచ్‌బి కాలనీ వాసులకు ఆయా సచివాలయ సెక్రటరీలు, వాలంటరీల ద్వారా పోలీసులు దగ్గరుండి ప్రతి నెల నెలా రేషన్ పంపిణీ చేసే వ్యాన్‌ల ద్వారా సుమారు 10 రకాల సరుకులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో 42వ డివిజన్‌లో నిత్యావసర సరుకులను మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య చేతుల మీదగా వరద బాధితులకు అందజేశారు. 132 సచివాలయ సెక్రటరీ కుమార్, వెల్ఫేర్ అధికారి నజీర్, వాలంటరీ శ్రీవల్లి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డుదారులకే ఉచిత సరుకులు సమంజసం కాదు

బుడమేరు వరదల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు ఉంటేనే ఉచితంగా సరుకులు అందజేయటం సరికాదని, వరదల్లో మునిగిపోయిన ప్రతి కుటుంబానికి అందజేయాలని పలువురు కోరుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లు, సెంట్రల్ నియోజకవర్గంలోని 11 డివిజన్లు పూర్తిగా బుడమేరు వరద నీటి ముంపునకు గురయ్యాయి. లక్షలాది కుటుంబాలు నిరాశ్రయులైన విషయం తెలిసిందే. ఇప్పటికీ అజిత్‌సింగ్‌నగర్, రామకృష్ణాపురం, రాజరాజేశ్వరిపేట, వించిపేట, భవానీపురం, హెచ్‌బీ కాలనీ, ఊర్మిళానగర్, ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు, కబేళా తదితర ప్రాంతాల్లోని ప్రజలు ముంపులోనే మగ్గుతున్నారు. అయితే వరద ముంపు సమయంలో తెల్ల రేషన్ కార్డు ఉంటేనే ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపిణీ చేయటం విధానం కాదని, ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి సరుకులు ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నారు.

శ్రీరామ్ లోన్ ఉత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రానున్న పండుగ సీజన్ సందర్భంగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కస్టమర్లకు సులభంగా సౌకర్యవంతంగా నిధులను అందజేసే లక్ష్యంతో జిత్నే సమయ్ కా లోన్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటరామన్ తెలిపారు. నగరంలోని శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. కస్టమర్లు తమ ఆర్థిక అవసరాల కోసం గోల్డ్‌లోన్‌లను సాధారణ క్రెడిట్ రూపంలో ఉపయోగించుకోవడానికి తాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గోల్డ్ లోన్ కోసం దరఖాస్తుచేసుకునే కస్టమర్లు జిత్నే సమయ్ కా లోన్ కార్యక్రమం ఏడు రోజుల కాల వ్యవధితో ప్రారంభించినట్లు తెలిపారు.

మునేరు గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలి

ప్రజాశక్తి - వత్సవాయి : మునేరుకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్.హనుమంతరావు డిమాండ్ చేశారు. పోలంపల్లి మున్నేరు చెక్ డ్యామ్ కాలువ ద్వారా 26 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుందని కాలువకు పడిన గండ్లను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూడ్చి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వత్సవాయి మండలంలోని పోలంపల్లి గ్రామంలో రైతు, కౌలు రైతు (సిఐటియు) సంఘాల ఆధ్వర్యంలో అధిక వర్షాల వల్ల నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పోలంపల్లి మున్నేరు డ్యామ్ కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రకృతి విలయం వల్ల రైతులు నష్టపోయారని ఇటువంటి ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన పంటను ఎన్యుమరేషన్ చేసి రైతులు తాలూకా వాస్తవ పంట నష్టాన్ని అధికారులు అంచనా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి టి.రాంబాబు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు కె.జానకోటయ్య సిఐటియు నాయకులు బి.రాము నాయకులు కొండయ్య, రైతులు కాటేపల్లి వెంకటేశ్వర్లు జయరాజు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈఈ ఫిర్యాదు

ప్రజాశక్తి - వన్‌టౌన్

వరదల నేపథ్యంలో ప్రకాశం బరేజ్ గేట్లను బోట్లు ఢీ కొట్టడంపై వన్‌టౌన్ పోలీసులకు ఇరిగేషన్ ఈఈ. శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. 67వ నెంబర్ గేటును మూడు మర బోట్లు ఢీ కొట్టడం వెనుక కుట్ర కోణం ఉందేమోననే కోణంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఇరిగేషన్ శాఖ ఈఈ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సిపిఎం నేతల చొరవతో మృతదేహం తరలింపు



ప్రజాశక్తి-విజయవాడ : అజిత్‌సింగ్‌నగర్ పాత రాజీవ్‌నగర్ ప్లాట్ నెంబర్ 1245లో నివాసముంటున్న ఉడతా బాబాజి (49) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. అయితే వరదలో చిక్కుకొని కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉండగా, ఎవరూ పట్టించుకోలేదు. చేసేది లేక రాజీవ్‌నగర్ రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి, ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ నాయకులు కె.దుర్గారావు... వెంటనే పాయకాపురం సిఐ దృష్టికి తీసుకెళ్లారు. సిఐ స్పందించి అంబులెన్స్‌ను రప్పించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. బాబాజి అంత్యక్రియలు శుక్రవారం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాబాజి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పశ్చిమ వరద ప్రాంతాల్లో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి పర్యటన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 54,55,56 డివిజన్‌లలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పర్యటించారు. గడప గడపకు తిరుగుతూ వరద బాధితుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి నిత్యావసర సరుకులు, తాగునీరు సరిగా అందుతున్నాయో లేదో అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో తిరుగుతూ వారికి నిత్యావసర సరుకులు బియ్యం కూరగాయలు ఇతర సామాగ్రి అందజేశారు. మంత్రి వెంట 54వ డివిజన్ కార్పొరేట్, డివిజన్ టీడీపీ నాయకులు తర్జున్, సలీం వార్డు సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు నివాసాలు కోల్పోయి నిరాశ్రయులైన వారికి అండగా సిఐటియు మైలవరం అంగన్వాడీ ప్రాజెక్ట్ వర్కర్స్, హెల్పర్స్ బియ్యం, కూరగాయలు, ఆయిల్, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు అండదండగా సిఐటియు నిరంతరం ఉంటుందని ఇబ్బందుల్లో ఉన్న కార్మికులందరికీ భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, మైలవరం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఆర్వి పుష్ప కుమారి, సి హెచ్ శారద, బుల్లిమ్మ పాల్గొన్నారు.

రేపూడిలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : వరలదలతో డ్రెనేజీలు పొంగి వీధుల్లో మురుగునీరు అక్కడక్కడ నిలిచి ఉండటంతో రేపూడిలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు గ్రామంలోని ప్రతి వీధికి తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో డ్రెనేజీలలో బ్లీచింగ్ చల్లించి వరదలతో అక్కడక్కడ పేరుకుపోయిన చెత్త చదరాన్ని తొలగించారు. గ్రామ సర్పంచ్ వజ్రాల సత్యవేణి బ్రహ్మానందరెడ్డి ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఆరోగ్య సిబ్బందితో కలిసిశుక్రవారం ఈ పనులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గృహాల వెంబడి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు.

హోమియో మందులు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దాత వితరణతో శుక్రవారం ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. తిరువూరు సిటీ న్యూస్, సిటీ బ్రాడ్ బాండ్ అధినేత కిలారు శివరామకృష్ణ వితరణతో పట్టణ ప్రజల్లో రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు చేపట్టిన ఉచిత హోమియో మందులు పంపిణీ కార్యక్రమాన్ని 8వ వార్డు కౌన్సిలర్ నాళ్ళ సురేంద్ర టిడిపి సీనియర్ నాయకులు తాళ్లూరి రామారావుతో కలిసి ప్రారంభించారు. ప్రముఖ హోమియో వైద్యురాలు అనుమోలు పుష్ప కుమారి పర్యవేక్షణలో హోమియో మందులను వార్డు ప్రజలందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు సంకురాత్రి జనార్ధన రావు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మునిగిన పంటలు, కొట్టుకుపోయిన రోడ్లు

ప్రజాశక్తి - కంచికచర్ల :

వరదలతో మండలంలో పంటలు, రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విజయవాడలో అత్యధికంగా నష్టపోయినందున ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు అధికారులు తమ దష్టిఅంతా విజయవాడపై కేంద్రీకరించడంతో కంచికచర్ల మండలం ఏటిపట్టు గ్రామాలను, పట్టించుకునే నాధుడే కరువయ్యాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఏటిపట్టు గ్రామాలలో వంద సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా వరదలో మునిగిపోయాయని స్థానికులు అంటున్నారు. ఏనుగుగడ్డ వాగు కింద మాగాని పొలాలు మొక్కజొన్న పూర్తిగా మునిగిపోయాయి. మొక్కజొన్న 80 శాతం దెబ్బతిన్నది. మాగాణి రెండు రోజులపాటు నీళ్లలో నానింది. శుక్రవారం కూడా ఏనుగుడ్డవాగుకు వరద తగ్గలేదంటే ఏ స్థాయిలో వరద వచ్చిందో అర్థం అవుతుంది. ఈ వాగు కింద ఉన్న అల్లూరు జుజ్జూరు నరసరావుపాలెం గొట్టుముక్కల పరిటాల గ్రామాల పరిధిలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొక్కజొన్న బాగా దెబ్బతింది. తక్షణమే సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టం, రోడ్ల దుస్థితిని పరిశీలించి, నష్ట పరిహారం అఅందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : వరద బాధితులకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యకర్తలు ఉమ్మడిగా 50 కుటుంబాలకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. వరదల్లో నివాసాలు కోల్పోయి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలైన మైలవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, షాదిఖానా, వద్దకు వెళ్లి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్. సుధాకర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఆర్‌బి పుష్పకుమారి, సిహెచ్.శారద, ఎస్.సుధా, మీ రాజేశ్వరి, ఆశ నాయకురాలు పి.జ్యోతి, పాల్గొన్నారు.

రహదారుల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వత్సవాయి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనమే ధ్యేయంగా పనిచేస్తున్నారని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతికి వత్సవాయి మండలం, పాత వేమవరం - పెనుగంచిప్రోలు, పెనుగంచి ప్రోలు - ముచ్చింతాల గ్రామాల్లో రహదారులకు స్థానిక నేతలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు.

శేషమ్మకు నివాళి

ప్రజాశక్తి - గంపలగూడెం: ఊటుకూరు సిపిఎం గ్రామ కార్యదర్శి, సీనియర్ నాయకులు నందిగామ జనార్ధన చారి తల్లి శేషమ్మ (96) మృతి చెందారు. వయోభారంతో బాధపడుతూ, గురువారం రాత్రి తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శేషమ్మకు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. శేషమ్మ సిపిఎం పట్ల సహృదయంతో కుమారుడు జనార్ధన చారిని పార్టీ బలోపేతానికి సహకరించేవారు. శేషమ్మ మృతదేహాన్ని సిపిఎం నాయకులు పలువురు సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. గంపలగూడెం మండల కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, మండల కమిటీ సభ్యులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, మీసాల గోపాలకష్ణ నివాళులర్పించారు.

మహిళకు గాయాలు

ప్రజాశక్తి - గంపలగూడెం: కనుమూరుకు చెందిన అక్కల రాజగోపాల్ రెడ్డి-లక్ష్మి దంపతులు గంపలగూడెం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంలో గంపలగూడెం నుండి తిరువూరుకు పోతున్న ఆర్టీసీ బస్సు చింతలపాడు గుర్రపు వాగు వద్ద ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు తీవ్ర గాయాలు కావడంతో తిరువూరు ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని విజయవాడ తరలించినట్లు గ్రామస్తులు వివరించారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

విజయవాడ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏటా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోలు బంకు యజమాని ఎంవివి సత్యనారాయణ, నందకిశోర్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని పెట్రోలు బంకులో శుక్రవారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఒసిఎల్ ఎన్‌టిఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కొమ్మోజు వరప్రసాద్, మేనేజర్ కె.వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - అవనిగడ్డ : వరద విపత్తుతో తీవ్రంగా నష్టపోయిన బాధితుల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 50 టా ర్పలిన్లు 50 హైజానిక్ కి ట్స్ 1000 లీటర్ల వాటర్ బాటిళ్లు అందజేశారు. నియోజకవర్గంలో విపత్తు గురించి రెడ్ ట్రస్ట్ సొసైటీ స్టేట్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ వివరించడంతో నియోజకవర్గంలో ఇల్లు పడిపోయిన వారికి టార్పి న్లు ఇతర పరికరాలను గురువారం రాత్రి ఎమ్మెల్యే తనయుడు నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ కు అందజేశారు. రెడ్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ జిల్లా శాఖ ద్వారా డిస్టిక్ చైర్మన్ డాక్టర్ టి ఎస్ ఎస్ బాలాజీ కార్యదర్శి భవిరి శంకర్నాథ్ పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ శివారు రేగులంక అవనిగడ్డ పంచాయతీ శివారు ఓసుమట్ల గ్రామాలకు చెందిన వరద బాధితులకు నియోజకవర్గ యువ నాయకులు మండ లి వెంకట్ రామ్ చేతుల మీదుగా రూ 40 వేల ఖరీదు చేసే దుప్పట్లను 250 మందికి అందజేశారు. అలాగే మండల పరిధిలోని రేగులంక గ్రామంలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న బాధితులకు పౌరసరఫరాల శాఖ ద్వారా అందజేస్తున్న నిత్యవసర సరుకులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అందజేశారు. శుక్రవారం సాయంత్రం ఉల్లిగడ్డ పంచాయతీ పరిధిలోని రేగులంక గ్రామాన్ని బుద్ధ ప్రసాద్ పరిశీలించి సరుకులు పంపినీ చేశారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రాం, డిప్యూటీ తాసిల్దార్ మండలి కేసరి పాల్గొన్నారు. అలాగే పులిగడ్డ పంచాయతీ శివారు పల్లెపాలెం వరద బాధితులకు ప్రముఖ పారిశ్రామికవేత్త విక ర్తి శ్రీనివాస్ ఆహార పొట్లాలు అందజేశారు. వరదల వల్ల సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న బాధితులకు అమెరికా జనసేన ఎన్నారై విభాగం భారీ సహాయం అందజేసింది. రూ 20 లక్షల వ్యయంతో 1050 కుటుంబాలకు బియ్యం సరుకుల కి ట్స్ పంపిణీ చేశారు. ఎన్నారై విభాగం ప్రతినిధి అనుసూరి అనిల్ జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ పర్యవేక్షణలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ బాధితులకు పంపిణీ చేశారు. **మచిలీపట్నం రూరల్ :** విజయవాడ నగర నగర వరదబాధితుల సహాయార్థం మచిలీపట్నం నుండి మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 150 కుటుంబాలకు సరిపడా 75 వేల రూపాయల విలువ గల నిత్యవసర సరుకుల (కందిపప్పు ,ఉల్లిపాయలు,ఆయిల్, పంచదార, గోధుమపిండి, ఉప్పు, బిస్కట్ పాకెట్స్) కిట్స్ వితరణ చేశారు. స్టార్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీరాం జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి రాధాకష్ణ పాల్గొన్నారు. **పెదపారుపూడి :** వరదల ముంపుకు గురైన మోపర్రు గ్రామస్తులకు వెంట్రప్రగడ భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులకు ఆహార పదార్థాలను అందించారు. స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చైతన్య, స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, తాసిల్దార్ వై రంగారావు పాల్గొన్నారు. **కంకిపాడు :** కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో ముంపు కి గురైన కాలనీలో బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. తోటకూర రాజానంద్ బాబు విజయవాడ వరద బాధితుల నిమిత్తం 2 లక్షల రూపాయలను పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్‌కు అందజేశారు. ముప్పా రాజా, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, తోటకూర సుబ్బారావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ విఫలం..!

- బుడమేరు వరద ఉధృతికి కారణాలు వెల్లడించని అధికారులు
- ముందస్తు అప్రమత్తంపై బాధ్యతారాహిత్యం
- ప్రజల నుంచి విమర్శల వెల్లువ

ప్రజాశక్తి-విజయవాడ: అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న జల వనరుల శాఖాధికారులపై వరద బాధిత ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో బుడమేరు పరివాహక సింగ్‌నగర్‌తో పాటు ఇతర పలు ప్రాంతాలు జలప్రళయానికి గురై ప్రాణనష్టంతో పాటు ఇతర అనేక రూపాల్లో లక్షలాది మంది ప్రజలు కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారు. 11 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన బుడమేరుకు 40 వేల క్యూసెక్కుల వరద వచ్చి దాని క్యాచ్‌మెంట్ ఏరియాను మొత్తాన్ని వరదలో ముంచెత్తింది. అయితే ఈ వరద ప్రమాదం పట్ల ముందస్తుగా ప్రజలకు చెప్పడంలో ఇరిగేషన్ ఘోరంగా విఫలమయింది. గత వారం రోజుల నుంచి సింగ్‌నగర్‌తో పాటు గొల్లపూడి, రాయనపాడు, భవానీపురం తదతర ప్రాంతాల ప్రజలు భీతిల్లిపోతూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఉండటానికి ప్రధాన కారణం ఈ ప్రాంతాలను ముంచెత్తిన బుడమేరు వరద. వరద వస్తుందని ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడం కానీ, ఈ వరద రావడానికి కారణాలను వివరించి చెప్పడంలో ఆయా శాఖల అధికారుల నడుమ చోటు చేసుకున్న సమన్వయ లోపం, ప్రధానంగా ఇరిగేషన్‌శాఖ అధికారుల బాద్యతారాహిత్యమని వరద బాధితులు దుమ్మెత్తిపోస్తున్నారు. మరలా గురువారం సాయంత్రం నుంచి వరద పెరుగుతూ శుక్రవారం రెండు అడుగుల మేర వరద పెరగడంతో సింగ్‌నగర్ ప్రాంత ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు భీతిల్లిపోతూ...ఇళ్లకు వచ్చిన వారు సైతం మరలా పునరావాస కేంద్రాలు, స్నేహితులు, బంధువుల ఇళ్లకు వరద బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగెత్తాల్సి వచ్చింది. వరద స్థితిగతులపై ప్రజలను అప్రమత్తం చేసే దగ్గర నుంచి ఎగువ ప్రాంతం నుంచి బుడమేరు వరద ఎందుకు పెరుగుతుంది తదితర అంశాలను ప్రజలకు వివరించడంలో, కనీసంగా మీడియాకు సమాచారం ఇవ్వడంలో ఘోరంగా విఫలమయిన ఇరిగేషన్ శాఖాధికారుల పట్ల ప్రజల్లో తీవ్రమైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శుక్రవారం రాత్రి 9 గంటల సమయములో వరద తీవ్రతపై ప్రజాశక్తి ఇరిగేషన్‌శాఖ ఎస్ఇకి ఫోన్ చేసినా కనీసంగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

చీమలవాగు పొంగడంతో ఇళ్లలోకి నీరు

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం మండలం చిక్కవరం గ్రామం లో చీమల వాగు దాటికి ఇళ్ళలోకి వర్షపు నీరు చేరింది. గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణరావు చొరవతో గ్రామ పెద్దలు,గ్రామ పంచాయతీ కార్యదర్శి ,గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ సచివాలయం ఉద్యోగులు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రకతి బీభత్సవానికి బాపులపాడు మండలంలో నీటమునిగిన ఓగిరాల, ఆరుగొలను, అప్పారావుపేట గ్రామస్తులను బాపులపాడు మండలం జడ్పీహెచ్ స్కూల్లో వసతి కల్పించారు.. వారికి హనుమాన్ జంక్షన్ హనుమాన్ నగర్ కు చెందిన మహమ్మద్ అక్బర్ బాబా గారి సాయి తాజుద్దీన్ బాబా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ నిర్వాసితులకు అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించారు.

బొబ్బర్లంకలో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి- మోపిదేవి : ఈ-క్రాప్ నమోదు లేకపోయినా పంటలకు నష్ట పరిహారం ఇచ్చేలా రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో ముంపు నీట మునిగి పాడైన ఫర్నిచరును, మధ్యాహ్న భోజన పథకం వంటగదిలోని సామాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ణానది వరదకు బొబ్బర్లంక గ్రామస్తులు సమస్తం కోల్పోయారని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య, జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, సీనియర్ నాయకులు సబ్బినేని సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

బాధితులకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరు పాలెం వరద బాధిత పునరావాస కేంద్రంలో శు క్రవారం రొయ్యూరు గ్రామానికి చెందిన ప్రముఖ టిడిపి నాయకులు ఉప్పులూరు గోపాలకష్ణ,వల్లూరు పాలెం గ్రామానికి చెందిన ఆచంట కోటి బాబు ఏర్పాటుచేసిన భోజనాన్ని బాధితులకు అందించారు. తోడేళ్ల దిబ్బలంక, కాళింగ దెబ్బ లంక గ్రామానికి చెందిన వరదబాధితులను వల్లూరు పాలెం గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉంచారు. 480 మంది వరద బాధితులకు కోటి బాబు, గోపాలకష్ణ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో భోజనం ఏర్పాటు చేసి స్వయంగా దగ్గరుండి వడ్డించారు.

పెదపారుపూడి : పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంటున్న మోపర్రు వరద బాధితులకు మండలంలోని అంగనవాణ కార్యకర్తలు సొంత నిధులతో ఒకరోజు భోజనం ఏర్పాటు చేశారు. అంగనవాణి కార్యకర్తలు కే వాణి, ఏ నాగ ద్రౌపతి, డి పద్మలత, ఎస్ జ్యోతి, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పల అనుష అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి - పెడన : కౌతరం కెనాల్ బంటుమిల్లి ఛానల్ కు సమీపంలోని సాతులూరు గ్రామ ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని లంకల కలవగుంట గ్రామంలోని బంటుమిల్లి కాలువను పరిశీలించారు. అనంతరం కలవగట్లపై జీవనాన్ని కొనసాగిస్తున్న నాలుగు కుటుంబాలను లంకల కలవకుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించేందుకు తరలించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి కాలువలో వరద నీటి ప్రవాహం గురించి వివరాలను కలెక్టర్ జలవనుల శాఖ డి ఈ సూర్య భరత్ ను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణి, పెడన తహసీల్దారు కాగిత పూర్ణచంద్రరావు, డ్రైనేజీ డి ఈ మురళి, వీఆర్వోలు పరసా గోవిందరాజులు, కట్టా వీరబాబు పాల్గొన్నారు. **గుడివాడ :** బుడమేరు ముంపు బాధిత గ్రామాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి బుడమేరు వరద పరిస్థితి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుద్రపాక, జొన్నపాడు, నందివాడ, ఇలపర్రు, గాజులపాడు గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి, జలవనరుల శాఖ డి ఈ సూర్య భరత్, తహసిల్దారు మల్లిక పాల్గొన్నారు. నందివాడ మండలంలో బుడమేరు వరద ఉధతి పెరుగుతుండడంతో పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు ఎక్కువై రుద్రపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీట మునిగింది. అనమనపూడి గ్రామపంచాయతీ మంచి నీటి చెరువు వర్షపు నీటితో నిండి రహ దారులపై పొంగిపొర్లుతున్న పరిస్థితి నెలకొంది.

పత్రికలో ప్రచురితమైన కథనంపై ఖండన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఒక తెలుగు దినపత్రికలో ఈ నెల 6న ఆ అధికారులు వరద వారియర్స్ – విధి నిర్వహణలో విఫలమైన మండల రెవెన్యూ అధికారి అనే శీర్షిక ప్రచురితమైన కథనంపై తహశీల్దార్ వై.వెంకటేశ్వర్లు ఖండించారు. ఈ ప్రచురణపై ఒక ప్రకటనలో ఖండన విడుదల చేశారు. అల్పపీడన ద్రోణి వల్ల 30 అర్ధరాత్రి నుండి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది కుటుంబాలను వదిలి నిద్రాహారాలు మాని పూర్తిస్థాయిలో వరద సహాయక చర్యలు నిమగ్నమయ్యారని తెలిపారు. పూర్తి అంకితభావంతో సహాయక చర్యల్లో పాల్గొన్నా ఇలాంటి శీర్షికతో ప్రచురించడాన్ని ఆయన ఖండించారు.

వర్తక సంఘం నూతన కార్యవర్గం

జగ్గయ్యపేట : షరాబు వర్తక - సంఘం (బులియన్ మర్చంట్స్ అసోసియేషన్) చైర్మన్‌గా మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ గౌరవాధ్యక్షునిగా శ్రీరాం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొంకిమళ్ళ మల్లిఖార్జునరావు (మల్లు), కోశాధికారిగా యర్రం శివప్రసాద్ ఎన్నికయ్యారు. శ్రీరాం సుబ్బారావు చైర్మన్‌గా ఆరోసారి ఎన్నికయ్యారు. షరాబు వర్తక సంఘం ఆధ్వర్యంలో బంగారం కొట్ల కూడలిలోని స్వయంభూ వినాయకుని ఆలయం వద్ద వినాయక నవరాత్రి వేడుకలను నిర్వహించాలని తీర్మానించారు.

తాగునీరందించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తిరువూరు : గత కొన్ని నెలలుగా తిరువూరు పట్టణ ప్రజలను పట్టి పీడిస్తున్న తాగునీటి ఎద్దడి సమస్యను తక్ష ణమే పరిష్కరించాలని, పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు శుక్ర వారం తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. పట్టణ ప్రజలకు రక్షిత మంచి నీరు సరఫరా చేయాలని, దోమలు నిర్మూలనకు మందు పిచికారి చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ తాగునీరు అందక, వాటర్ ప్లాంట్లపై ఆధారపడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. నగర పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి రక్షిత మంచినీరు సరఫరా, దోమల నిర్మూలన, పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్వి భద్రం, పట్టణ నాయకులు పంతంగి శ్రీనివాసరావు, బలగాని వెంకటేశ్వరావు, ఆకుల రవి పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు నివాసం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి విపత్తుల పరిస్థితుల్లో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో బాధితులకు తమ వంతు సాయం అందించేందుకు తరలి వచ్చారు. ఇబ్రహీంపట్నంలో ముంపు ప్రాంతాలైన ఫెర్రీ, తుమ్మల పాలెం గ్రామాల్లో సుమారు 700 కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) పాల్గొని సరుకులను పంపిణీ చేశారు.

హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నాలుగు రోజులుగా కురిసిన వరద ముంపుకి జగ్గయ్యపేట పట్టణానికి తాగునీరు అందించే హెడ్ వాటర్ వర్క్స్ నీటిమట్టంతో నిండిపోయి పూర్తిగా పాడైపోయింది. శుక్రవారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నాయకులు, అధికారులతో కలిసి పాడైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో పైపులైను, మోటార్లు, ఇతర సామాగ్రి పూర్తిగా పాడైపోయాయి. మరమ్మతులు చేపట్టి పట్టణానికి తాగునీరు అందించాలని తాతయ్య అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రావు, పట్టణ టిడిపి సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

9 లోపు పంట నష్టం నమోదు చేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 9వ తేదీ లోపు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొలాలకు సంబంధించిన రైతుల వివరాలు సేకరించాలని తిరువూరు మండల వ్యవసాయధికారి పి.పద్మ కోరారు. మండలంలోని మల్లేలలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. వరద తాకిడికి నీట మునిగిన, మేటవేసి 33శాతం పంట నష్టం వాటిల్లిన రైతుల వివరాలు నమోదుచేసి, మండల వ్యవ సాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయా గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఏవో ఆదేశించారు. ఈ కెవైసీ 15తో ముగుస్తున్నందున ఈ- క్రాప్ నమోదు, ఈ- కేవైసీ (రైతుల వేలిముద్రలు) వేగవంతం చేయాలని ఆదేశించారు.

నిత్యావసర సరుకుల వితరణ

ప్రజాశక్తి - విజయవాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయవాడ వరద ముంపు బాధితులకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక 16 డివిజన్లోని 1500 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, గోధుమపిండి, పంచదార, ఆయిల్, పసుపు, ఉప్పు, కారం, కందిపప్పు లాంటి నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ ను వరద ప్రభావితం చేసింది అన్నారు. ఆరోగ్యం, ఫుడ్ పరంగా బాధితులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని ముఖ్యమంత్రి సూచించారని, సీఎం ఆదేశాలతో ప్రజా ప్రతినిధులు, అధికారులు సహాయం అందిస్తున్నా రన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సీఎం చంద్రబాబు సహాయక చర్యలు అందిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో బాధితులకు తామున్నామని టిడిపి ప్రభుత్వం తరపున తాము కూడా సహాయక చర్యల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెంటి సునీల్ చౌదరి (చిత్తూరు అబ్జర్వర్), ముత్తు రవి, రత్న రమేష్ (టిడిపి 16వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు), టిడిపి నేత గద్దె క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

కాకతీయ- అపోలో విద్యాసంస్థల సాయం

ప్రజాశక్తి - నందిగామ : వరద బాధితుల సహాయార్థం నందిగామ కాకతీయ విద్యాసంస్థల విద్యార్థుల తల్లిదండ్రులు రూ.1.50లక్షలు విలువ చేసే సరుకులు అందజేశారు. నందిగామ కాకతీయ అపోలో విద్యా సంస్థలు, మేనేజ్మెంట్ సహాయంతో, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సేకరించిన రూ.1.50 లక్షల విలువచేసే బియ్యం, కందిపప్పు, నూనె, సబ్బులు, పేస్టులు, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు, దుస్తులను, ఒక లారీలో విజయవాడ తీసుకువెళ్లి, కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేశారు. కొన్ని దీనస్థితిలో ఉన్న ప్రాంతాలకు, వెళ్లడానికి, నీరు ఉన్నందువల్ల వెళ్లలేక వాటిని, 8వ తారీకు, (ఆదివారం) పంపిణీ చేయనున్నట్లు నందిగామ కాకతీయ అపోలో విద్యాసంస్థలు అధినేత కాపా రవీంద్రనాథ్ తెలిపారు.

వినాయకుని విగ్రహాల అమ్మకాలపై వరద ప్రభావం

ప్రజాశక్తి - భవానీపురం : నగరంలో బుడమేరు వరదలు తమకు శాపంగా పరిణమించిందని వినాయకుని బొమ్మల తయారీ దారులు వాపోతున్నారు. విషయంలోకి వెళ్తే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని సితార సెంటర్ సమీపంలోని బైపాస్ రోడ్డులో విఘ్నేశ్వరుని పండుగ నేపథ్యంలో గత నెల రోజులుగా అష్టకష్టాలు పడి రాజస్థాన్‌కు చెందిన కార్మికులు 5 అడుగుల నుండి 25 అడుగుల వరకూ వివిధ రూపాల్లో, వివిధ రంగుల్లో ఆకర్షణీయమైన వినాయుకని బొమ్మలు తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. అయితే ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు తోడు, బుడమేరు వరద నీరు పలు డివిజన్లలోని నివాసాల్లో చేరిపోయింది. దీంతో బొమ్మలు తయారుచేసిన వారు అమ్మకాలు లేక లబో దిబో మంటున్నారు. బొమ్మలు తయారు చేసే కార్మికులకు ఇచ్చిన డబ్బులు కూడా రాలేదని బొమ్మల తయారీ నిర్వాహకురాలు లక్ష్మీ 'ప్రజాశక్తి' వద్ద వాపోయింది. బుడమేరు వరద ముంపు మా పాలిట శాపంగా మారిందని బొమ్మల తయారీ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది తయారు చేసిన బొమ్మలు అమ్మకాలు సాగక చాలా మిగిలిపోతున్నాయని అంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

35 పునరావాస శిబిరాల్లో 11,384 మంది

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

బుడమేర, కృష్ణానది వరద నేపథ్యంలో విజయవాడ రూరల్‌లోని 15 కేంద్రాల్లో 3,403, విజయవాడ పశ్చిమలోని మూడు కేంద్రాల్లో 368, విజయవాడ తూర్పులోని ఐదు కేంద్రాల్లో 1,752 మంది, విజయవాడ ఉత్తర మండలంలోని రెండు కేంద్రాల్లో 501 మంది, విజయవాడ సెంట్రల్‌లోని మూడు కేంద్రాల్లో 578 మంది, ఇబ్రహీంపట్నంలో ఐదు కేంద్రాల్లో 4,689 మంది, మైలవరంలోని రెండు కేంద్రాల్లో 93 మంది పునరావాస శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రానికి మొత్తం 35 కేంద్రాల్లో 11,384 మంది పునరావాసం పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ముంపుకు గురైన పంటలు

ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో 17 మండలాల్లోని 310 గ్రామాలు, రెండు పట్టణాల పరిధిలో 2.67 లక్షల మంది భారీ వర్షాలు, వరదల ప్రభావానికి గురైనట్లు అధికార యంత్రాంగం ప్రాధమికంగా అంచనా వేసింది. 36,301 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 5,227.25 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి.

దెబ్బతిన్న గృహాలు 197

వరదలు, వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లాలో 197 గృహాలు దెబ్బతిని రూ.1.21 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాధమిక అంచనా. ఎనిమిది పక్కా గృహాలు పూర్తిగా, 55 పాక్షికంగా దెబ్బతిన్నాయి. 64 కచ్చా గృహాలు పూర్తిగా, 56 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొత్తగా నిర్మించి లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన 14 కచ్చా గృహాలతోపాటు 15 గుడిసెలకు నష్టం వాటిల్లింది.

25 మంది మృత్యువాత

వరదలు, వర్షాలకు 25 మంది మృత్యువాతపడినట్లు అధికారికంగా గుర్తించారు. వీరిలో 24 మృతదేహాలను గుర్తించగా, మరో మృతదేహం వివరాలు తెలియలేదని చెబుతున్నారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో ఆవులు, ఎద్దులు, గేదెలు 30, గొర్రెలు 257, పౌల్ట్రీ కోళ్ల 63,700 మృతి చెందాయి. పశువుల కొట్టం పూర్తిగా దెబ్బతిన్నది. వీటి విలువ రూ. 20.68 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

ఎన్‌సిసి కేడెట్ల సేవలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వరద ముంపు ప్రాంతాల్లో 8-వ ఆంధ్ర ఎయిర్ వింగ్ ఎన్సిసి అధికారులు, క్యాడెట్లు విస్తృతస్థాయి సేవలందించారు. నాలుగు రోజులుగా పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం, భవానీపురం, కబేళా ప్రాంతాల్లోనూ, అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం ఆంధ్రప్రభ కాలనీ, ఓల్డ్, న్యూ రాజా రాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో వరద బాధితులకు అండగా నిలిచారు. కమాండింగ్ ఆఫీసర్ అజిత్‌సింగ్ రాటి ఆదేశాల మేరకు నాలుగు వాహనాలతో అల్పాహారం, భోజనం ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, కేకులు, ఎనర్జీ డ్రింకింగ్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, దుప్పట్లు, తదితర వంట సామాగ్రిని జూనియర్ వారెంట్ ఆఫీసర్ సూరజ్ నేతృత్వంలో నాలుగు వాహనాల ద్వారా సిబ్బంది బాధితులకు పంపిణీ చేశారు.

ప్రభుత్వాల అసమర్థత వల్లే విజయవాడ మునక

రైతు, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వాలు ముందుచూపు లేకపోవడంతోనే విజయవాడ నగరం ముంపునకు గురైందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. బుడమేరు పొంగిపొర్లిన ప్రాంతాన్ని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జి.కొండూరు మండలంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30, 31 తేదీలలో భారీ వర్షాలు పడటం వలన బుడమేరు పొంగి సుమారు 25 నుంచి 30 సెంటీమీటర్లు వర్షపాతంతో విజయవాడ నగరం తోపాటు, విజయవాడ రూరల్ మండలం మునగటానికి ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని రాబోయే కాలంలో విజయవాడ ముంపు గురవకొండ శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని

బుడమేరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కృష్ణయ్య, సైదులు

వాణిజ్య పంటలకు 50 వేలు, వరికి 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతులకు నేరుగా వారి పేరుని నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి గోపి నాయక్, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీనిక్స్ గ్రీన్ వ్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఫీనిక్స్ గ్రీన్ వ్యాలీ సంస్థ నిరంతర సహాయం అందిస్తోంది. వరద తాకిడితో సర్వస్వం కోల్పోయిన వారికి కనీస అవసరాలైన ఆహారం, తాగునీరు అందజేస్తున్న ఫీనిక్స్ గ్రీన్ వ్యాలీ సంస్థ తమ సేవలకు కొనసాగింపుగా, రూరల్ మండల పరిధిలోని రెండు గ్రామాల నుంచి పాలను సేకరించి వరద బాధితులకు పంపిణీ చేసింది. ఫీనిక్స్ గ్రీన్ వ్యాలీ సీఎండీ నాగ భాస్కరరావు మానికొండ సారథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులు మంగళాపురం, సీతారాంపురం గ్రామాల్లోని పాడి రైతుల ఇళ్లలు వెళ్లి.. వరద బాధితుల సహాయార్థం పాలను సేకరించారు. దాదాపు 200 లీటర్ల పాలను గ్రామస్తులు ఉచితంగా అందించగా, మరో 350 లీటర్ల పాలను ఫీనిక్స్ గ్రీన్ వ్యాలీ సంస్థ కొనుగోలు చేసింది. మొత్తం 550 లీటర్ల పాలను అర లీటరు ప్యాకెట్లుగా చేసి, రాజీవ్ నగర్, కండ్రికల్లోని వరద బాధితులకు శుక్రవారం నాడు ఉచితంగా పంపిణీ చేశారు. అల్పాహారం, మూడు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ వరద బాధితుల దగ్గరకు తమ బృందంతో వెళ్లి వారిని పలకరించి వారికి నిత్యావసర వస్తువులను ఇచ్చారు. 1100 విలువ కలిగిన బియ్యం పప్పు ఉప్పు కారం పంచదార ఆయిల్ దుప్పట్లు ఇలా ఇచ్చారు. శుక్రవారం ప్రత్యేకించి 400 మందికి దాదాపుగా పంచారు. ఆ తరువాత స్కూల్ కాలేజీ పిల్లలకు చదువుకు సబంధించినవి ఇచ్చి వారికి సహాయం చెయ్యాలనే ఉదేశ్యం తో దహించు అగ్ని ట్రస్ట్ ద్వారా ఇవ్వాలని సామాగ్రిని సిద్ధ పరుస్తున్నారు. గడచిన 34 సంవత్సరాలనుండి ఇటువంటి ఎన్నో కార్యక్రమాలను డా. థామస్ శక్తి కొలది చేస్తున్నామని తెలియపరిచారు. ఇటువంటి కష్ట సమయాలలో బీధవారికి అంగవిహీనులకు ధన రూపంలో వస్త్ర రూపంలో ఇంకా అనేక విధములుగా సహాయం చేసినట్లు అయన చెప్పారు. ఈ మంచి కార్యక్రమంలో డాక్టర్ థామస్ నర్సింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ విక్టోరియా రేవారెండ్ ఫాథర్, గుణదల ఆల్సైటీ లయన్స్ క్లబ్ చైర్మన్ క్రిస్టోఫర్ పాస్టర్ ఆనంద్ సునీల్ పాస్టర్ జోసెఫ్ అలెక్స్, సిస్టర్ కరిష్మా ప్రైజీ పాల్గొన్నారు.

వరద నీటిలో 72 అడుగుల మట్టి వినాయకుడు

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక సితార సెంటర్ సమీపంలోని లేబర్ కాలనీ స్టేడియం స్థలంలో వినాయక చవితి పండుగను డూండీ రాకేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా 72 అడుగుల మట్టి వినాయకుని విగ్రహం తయారుచేసి సిద్ధం చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్షం నీటితో పాటు బుడమేరు వరద నీరు కూడా స్టేడియం స్థలంలో చేరిపోయింది. గ్రౌండ్ స్థలంలో నీరు నిలిచిన కారణంగా 72 అడుగుల మట్టి వినాయకుని చూడటానికి వచ్చేవారి కోసం నీటి ఇబ్బందులు లేకుండా ఇనుప రాడ్‌లతో కాలిబాట వంతెన ఏర్పాటు చేస్తున్నట్లు డూండీ రాకేష్ తెలిపారు.

72 అడుగుల మట్టి వినాయకుడు
స్టేడియం స్థలం చుట్టూ నీరు

దీర్ఘకాలిక సాయం అందిస్తాం : పురందేశ్వరి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఎపికి ప్రకృతి విపత్తు వల్ల కలిగిన నష్టం అంచనా వేసిన తర్వాత కేంద్రం నుంచి తక్షణ సాయంతో పాటు దీర్ఘకాలిక సాయం కూడా అందిస్తామని, కేంద్రానికి రాష్ట్రానికి వారధులుగా తాము పనిచేస్తామని పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కొండపల్లి శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య బుడమేరు మళ్లింపు కాల్వకు పడిన గండ్ల పూడ్చివేత పనులను ఏపీ జలవనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు, పురందేశ్వరీ, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు, ఎన్డీఏ మహాకూటమి నేతలు శుక్రవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ విజయవాడ నగరం, మైలవరం నియోజకవర్గానికి ఇప్పుడు జరిగిన నష్టం ఇంతకు ముందెన్నడూ చూడలేదన్నారు. బుడమేరు మళ్లింపు కాలువకు మూడు చోట్ల భారీ గండ్లు పడ్డాయన్నారు. జక్కంపూడి లో ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు, తోపుడు బండ్లు అన్ని నీటిపై తేలియాడుతున్నాయి అన్నారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తడం వల్లనే విజయవాడ నగరం మునిగిందని ప్రచారం చేస్తున్నారని, గేట్లు మూసి వున్నా ఇప్పటికీ వరద ప్రవాహం ఉందని ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు (బాల) పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సాయం : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అనుకోకుండా సంభవించిన విపత్తులో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తోడుగా ఉంటుందని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.డిల్లీరావు వరద బాధితులకు భరోసా ఇచ్చారు. ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసరాలతో కూడిన కిట్‌ను అందిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా కృష్ణలంకలోని 16వ డివిజన్‌లో డిల్లీరావు బాధితులకు శుక్రవారం అందజేశారు. డివిజన్ వరద సహాయ చర్యల పర్యవేక్షకుడిగా ఆయన 25 కేజీల బియ్యం, రెండు కేజీల ఉల్లిపాయలు, రెండు కేజీల బంగాళదుంపలు, ఒక కేజీ పంచదార, చింతపండు, పామోలిన్ ఆయిల్ ఒక లీటర్ తో కూడిన ఈ కిట్లను వెయ్యి మంది బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన ప్రతి బాధితునికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరూ సాధారణ జీవిత స్థాయికి వచ్చేంతవరకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తామన్నారు. పారిశుధ్యం, ఆరోగ్య అంశాలలో సైతం ప్రభుత్వం సంతప్తికర స్థాయిలో ఏర్పాటు చేస్తుందన్నారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, బురదతో నిండిపోయిన ఇళ్లను శుభ్రం చేసేందుకు వినూత్న రీతిలో ఫైర్ వాహనాలను సైతం వినియోగిస్తోందని తెలిపారు. బాధితులు ఎవరూ తమకు సహాయం అందలేదని ఆందోళన చెందవద్దని, వరుస క్రమంలో ప్రతి ఒక్కరికీ సహాయం అందించేందుకు కొంత సమయం పడుతుందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.